# అర్థం కాని ఒక అనుభవం



చెరువుపక్క రావిచెట్టుకింద పద్మాసనం వేసి కూర్చునేవాడు బైరాగి.

ఆ ఊరు నేను బదిలీమీద వెళ్ళి అప్పటికి నాలుగురోజులే అయింది. నేను 'రిలీజ్' చేసిన లేడీడాక్టరు యిల్లు నాకోసం ముందుగానే ఏర్పాటై ఉండడం వల్ల ఊరు చేరుకోగానే సరాసరి ఆ ఇంట్లో నేదిగాను. ఇంటినుండి ఆసుపత్రికి ఆ చెరువుపక్కనుంచే వెళ్లాలి. పెద్ద దూరంలేదు. రెండు ఫర్లాంగుల లోపు. అంచేత నడిచే వెళ్ళేదానిని. ఊరువాళ్లకి అది విడ్డూరంగా ఉండేదని తరువాత తెలిసింది.

మొదటి రోజున నేనతన్ని గమనించలేదు. రెండవరోజు ఉదయం ఆసుపత్రికి వెళుతూంటే అప్రయత్నంగా నా దృష్టి అతనిమీద పడింది.

నన్నుచూసి చిరునవ్వు నవ్వాడు. వేళ్లమధ్య రుద్రాక్ష

పి. శ్రీదేవి

మాలతో కుడిచెయ్యి పైకెత్తి, అభయ ముద్రతో నన్ను ఆశీర్వదించాడు. మంత్రంలాంటి మాట లేవో ఉచ్చరించాడు. నాకు అప్రయత్నంగా అడుగు పడలేదు. క్షణమాత్రం అతనిని పరికించి చూశాను.

పులి చర్మం మీద కూర్చున్నాడు. కాషాయరంగు గోను లాంటిది తొడుక్కున్నాడు. నుదుటిమీద పొడుగాటి కుంకుమతిలకం. పక్కనే భూమిలో పాతి నిలబెట్టిన త్రిశూలం.

చిరునవ్వుతో అతడు నన్ను పలకరించడం నిజానికి నాకొంచెం చికాకు కలిగించింది. గబగబా అడుగులు వేసి సాగిపోయాను. "ఎవడీ దొంగ బైరాగి?" అనుకున్నాను మనస్సులో.

మధ్యాహ్నం ఒంటిగంట వరకూ మళ్ళీ అతడు జ్ఞాపకం రాలేదు. అప్పటికి వార్డులో పని ముగించుకుని వచ్చి



అప్పుడే వచ్చిన 'పోస్టు' చూస్తున్నాను. సంతకాలకోసం డైట్‌షీట్లు తీసుకుని వచ్చి నా పక్కనే నిలబడింది స్టాఫ్‌నర్సు అహల్య. అప్పు డెందుకో బైరాగి గుర్తువచ్చాడు. "సిస్టర్! ఈ ఊళ్లో బైరాగు లెక్కువా?" అన్నాను, అహల్యతో బాతాఖానీ ధోరణిలో.

పరధ్యానంగా ఉన్న నర్సుకు ఆ ప్రశ్న అర్థంకాక - "బైరాగులా డాక్టర్!" అని మళ్ళీ ప్రశ్నవేసింది. వేసి, కాస్సేపాగి "లేదే! ఓ! ఆచెరువు పక్క రావిచెట్టుకింద బైరాగి సంగతేనా మీరు అడుగుతున్నది?" అంది. అవు నన్నాను.

"వాడూ ఈ ఊరు కొత్తగా వచ్చాడండీ! మీరు నిన్నకదూ ఛార్జి తీసుకున్నారూ! మొన్నపొద్దున్నే వాడూ ఈ వూరు చేరినట్టుంది. ఆ సాయంత్రం మీరు వస్తారనగా ఆ దినం ఉదయం మీ యింటిని కడిగి శుభ్రం చేయించుదామని నేనూ, ఆయా వెళ్ళాం. అప్పుడే వాడు ఆ రావిచెట్టుకింద కనబడ్డాడు. అదివరకు లేడు. అప్పుడే నేల శుభ్రం చేసుకుని సామాను పరుచుకుంటున్నాడు.... ఏం బైరాగులో ఏం పాడో! వాడిని ఓ కంట కనిపెట్ట మని పోలీసువాళ్ళకి చెప్పడం మంచి దేమో! ఏదో ఒక పనిమీద ఇనెస్పెక్టరుగా రిక్కడికి వస్తూనే ఉంటారుకదా! ఆయనతో మీ రొకమాటు చెప్పండి," అంది అహల్య కసిగా!

నేను నవ్వి, "భలేదానివే. ఉత్త పుణ్యాన వాడిమీద రిపోర్టు చేయడం దేనికి?" అన్నాను.

"ఏమోనమ్మా! ఈ బైరాగులను నమ్మకూడదు. వాళ్లలో రకరకాల దొంగవెధవ లుంటారు." అంది.

అంతటితో ఆ సంభాషణ ఆగిపోయింది.

* * *

మధ్యాహ్నం భోజనం అయాక ఓ కునుకు తీసి లేచాను. ఆదివారం కనుక, మళ్లీ మూడింటికే ఆసుపత్రికి వెళ్లే అవుసరంలేదు కనుక, తీరికగా వాలుకుర్చీలో కూర్చుని అమ్మయిచ్చిన వేడివేడి టీ తాగుతున్నాను. యథాలాపంగా అమ్మ, "ఊరు ఎలాగుందే అమ్మాయ్!" అంది. యాభై ఏళ్ళ జీవితంలో అమ్మ చాలా ఊళ్లు తిరిగింది. మనుషులకులాగే ఊళ్ళకుకూడా ప్రత్యేక వ్యక్తిత్వా లుంటా యని ఆవిడ నమ్మకం.

"ఏమో! అప్పుడే ఏం తెలుస్తుంది? ఆసుపత్రిలో పనిమాత్రం ఎక్కువగా ఉంది. మొగడాక్టరు యింకా సెలవు

నుంచి తిరిగిరాలేదు. ఆయన వచ్చే దాకా అన్ని పనులూ నేనే చూసుకోవాలి'' అన్నాను.

"ఏమైనా కొంచెం జాగ్రత్తగా ఉండాలిట అమ్మాయ్! పక్కింటి రిజిస్ట్రారుగారిభార్య నాతో ఖాతాఖానీ వేసుకుని ఊరుగురించి చాలా వింతగా చెప్పింది. ఉత్త ముదనష్టం ఊరట. ఊరు చిన్నదే అయినా గొడలు ఎక్కువట!'' అంది అమ్మ.

"అంటే?" అన్నాను.

"అంటే ఏముంది? డబ్బుతోనే అన్ని దుర్లక్షణాలు వస్తాయి. ఊళ్లో మోతుబరి రైతులు ఎక్కువట. అంచేత తీరిగ్గా కూర్చుని తగాయిదాలూ కక్షలూ పెంచుకుని కొట్టుకుంటుంటారుట." అంది ఆవిడ.

నేను నవ్వేసి "అది ప్రతి ఊళ్లోనూ ఉండేదే గదా! కాదుపోదంటే కొట్లాటలు ఎక్కువైతే పోస్టుమార్టమ్‌లు ఎక్కువౌతాయి. రానీ! మనదేం పోయింది. మన డ్యూటీ మనం సక్రమంగా చేసేస్తే ఎవరికీ భయపడనక్కరలేదు" అన్నాను.

అమ్మ నా వేపు అదోలా చూసింది. ఆ చూపు నాకు బాగా అర్థమయిన చూపు. ఆ ఒక్క చూపులో ఆమె గత స్మృతులన్నీ తన కళ్లలో ప్రతిఫలింప



"రాత్రి మీ పాపాయి పాలకోసం ఏడిస్తే ఎవరు ముందులేస్తారు?''
"మా పక్కింటివాళ్ళు.''

చేస్తుంది. ఆ క్షణంలో ఆవిడకు కనబడేది నేను కాదు. నా స్థానంలో మా నాన్నగారిని చూస్తుంది. ఆయన ముప్పై యేళ్ల డాక్టరు వృత్తి నాతో పునః ప్రారంభం కావడం చూస్తుంది. ఒక్క క్షణంలో ఆమెకు సంతృప్తీ, దుఃఖమూ రెండూ వస్తాయి. నా కెందుకో భయం వేసి మొహం దించేసుకుంటాను.

ఆదివార మన్న తృప్తీ, బద్ధకంగా యింట్లో గడిపేయగల అవకాశమూ మరొక అరగంటలోనే పోయాయి. పొరుగూరు సంతలో అయిదుగురు ప్రొహిబిషను కేసుకింద పట్టుబడ్డారనీ వచ్చి పరీక్షచేసి సర్టిఫికేట్లు యిప్పించచ

వలసిందనీ పోలీసు వాళ్లు వార్త పట్టుకొచ్చారు. వెంటనే బట్టలు మార్చుకుని ఆసుపత్రికి వెళ్లాను. చీకటి పడకముందే పని ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్నాను. దూరంనుండి బైరాగి అదే పద్మాసనంలో ధ్యానముద్రలో కన్పించాడు. దగ్గరవున్నకొద్దీ అతనిని పరికించిచూశాను. తీర్చిదిద్దిన విగ్రహం. వయస్సు యాభై పైన ఉండవచ్చు కాని శరీరం కమ్మెచ్చు తీసినట్లుగా ఉంది. ఐనా మొరటుగా లేదు. ఆ మొహంలో అనిర్వచనీయమైన ప్రశాంతత ఏదో కన్పించింది. నేను చూసిన చాలామంది బైరాగుల మొహాలలో రకరకాల తృష్ణల చిహ్నాలు కనిపించాయి. దురభ్యాసాల ముద్రలు స్పష్టంగా కనిపించాయి. ఈతని మొహం అటువంటిదికాదు. ఒకానొక అంతశ్శాంతి, తృష్ణలను జయించిన — కాదు. అధిగమించిన — నిర్మలత్వం అతని కళ్లల్లో కనబడింది. జయించడం అనేసరికి ఒక సంఘర్షణ జరిగిన దనే అర్థం వస్తుంది. అవేవీ అతడు పడినట్లు లేదు. పడినా, వాటిఛాయలు ఏనాడో కరిగిపోయి ఉండాలి.

"ముక్తుడు" అంటే యిటువంటి వ్యక్తేనా? అనుకున్నాను. మనిషీ, భగవంతుడు — యిద్దరి మధ్యా ఉన్న రహస్యాలేవో మెరిసినట్లనిపించాయి.

బ్యాగ్ తీసి ఒక పావలా కాసు అతని కమండలంలో పడేశాను. వెంటనే అతడు దానిని తీసి నాకు యిచ్చేస్తూ "వద్దు తల్లీ! వీడు డబ్బుతాకడు. పిల్లలు లేరూ — వాళ్లు అరిటి పళ్లూ అవీ యిస్తారు. చాలు" అన్నాడు. ఏమనాలో నాకు తోచలేదు. పావలా తిరిగి బ్యాగ్ లో పెట్టేశాను.

ఏదో మాట్లాడా లనిపించింది. "ఏ వూరు మీది?" అన్నాను. ఏం ప్రశ్న — అర్థంలేదు ఆ ప్రశ్నకు.

"జగజ్జననిది ఏవూరు తల్లీ? నాదీ ఆ ఊరే!" అన్నాడు.

బైరాగులందరూ అలాగే మాట్లాడుతారు — అయినా తిరిగి ప్రశ్నించేను.

"పోనీ పూర్వాశ్రమంలో మీరెవరు?"

"నాకు గతం లేదు. నా గతాన్నీ, పేరునీ, కాశీవిశ్వనాథుడి సమక్షంలో జగజ్జనని పాదాలకు అర్పించేశాను" అన్నాడు.

అంతలో ఎవరో స్కూలు పిల్లలు పరిగెత్తుకుంటూ వచ్చి అతనికి అరిటి పళ్లూ జామిపళ్లూ యిచ్చారు. ఆప్యాయంగా తీసుకుని పక్కన పెట్టుకుని వాళ్లందరినీ చిరునవ్వుతో ఆశీర్వ




"ఇప్పుడు చెప్పండి, ఏ డాన్సు నేర్చుకుంటారో! భరతనాట్యమా? జిప్సీ డాన్సా? కవాలియా? గ్రూప్ డాన్సా?"

"ఇవన్నీ పాతవేగా! నాకు 'రాకూరోలు' డాన్సు నేర్చుకోవాలనుందండి. యిప్పుడు ఏ సినిమాలోచూసినా అవేగా!"

---

దించాడు. నా వైపుతిరిగి "పిల్లలు — వాళ్లే దేవుడికి దగ్గరగా ఉంటారు. భగవంతుడి ఊపిరి వాళ్లకు వినబడుతుంది. కాని కర్మచక్రం బలీయమైనది కదా తల్లీ! అది ఆగదు. పిల్లలు పెద్దవాళ్లవుతారు. పాపపంకంలో యిరుక్కుంటారు" అన్నాడు.

ఏం మాటాడను? ఊరికే నవ్వాను. అంతే.

"వెళ్లు తల్లీ! నీ పుట్టుక చాలా గొప్పది. రోగిమానవ సేవ కంటె గొప్పది లేదు. అదృష్టవంతురాలివి" అన్నాడు.

నేను కొంచెం ఆశ్చర్యపడ్డాను. "నేను డాక్టర్నని మీ కెలా తెలుసు?" అన్నాను. అతడు చెయ్యి పైకెత్తి నన్ను ఆశీర్వదిస్తూ "అంతా జగజ్జనని చలవ. ఆ తల్లి నిన్ను రక్షిస్తుంది"

అనేసి రుద్రాక్షమాల తిప్పుతూ కళ్లు మూసేసుకున్నాడు. అతనన్న మాటలలో కొత్తదనం ఏమీలేదు. బైరాగులనబడే వాళ్లంతా అదే ధోరణిలో మాట్లాడుతారు. అయినా ఈ బైరాగి అనే ప్రతిమాటా స్వచ్ఛంగా ఉన్నట్లు అదొక్కటే నిజమయినట్లు ఆక్షణంలో నా కనిపించింది.

మర్నాడు కాబోలు ఆసుపత్రినుండి యింటికి తిరిగివస్తూ నాలుగు బత్తాయి పళ్లు కొని అతని కిచ్చాను. తరువాత నాలుగైదు రోజులు దొర్లిపోయాయి. ఇంటికీ ఆసుపత్రికీ రాకపోకలలో విధిగా మధ్య ఆగి, బైరాగిని పలకరించి ఒకటి రెండు మాటలు మాటాడకుండా ఉండలేక పోయే దానిని. చెరువూ, రావిచెట్టూ, బాటా, గ్రామం, దూరంగా పచ్చని పొలాలూ, పైన నీలాకాశం— వీటివలెనే ఆ బైరాగికూడా ప్రకృతిలో ఒక భాగంగా నా కనిపించే వాడు. యుగయుగాలనుండీ ఆ బైరాగి నాకు తెలిసినట్లే అనిపించింది. అదొక చిత్రమైన అనుభూతి.

ఎక్కడుంది దాని కిటుకు? విద్య వల్ల, వృత్తివల్ల, శాస్త్రీయ విజ్ఞానం అలవరచుకున్న దానిని. సంస్కారం వల్ల హేతువాదాన్ని వొంటపట్టించుకున్న దాన్ని. పరిశోధనశాలలో కప్పల్నీ, నిర్జీవమైన మానవ శరీరాలనూ కోసి భౌతిక సత్యాలను తెలుసుకున్నాను. రక్తప్రసారం ఎలా జరుగుతుందో, గుండె ఎలా కొట్టుకుంటుందో తెలుసుకున్నాను. సూక్ష్మజీవుల రహస్యాలను మైక్రొస్కోపుకింద పరీక్షించాను.


ఐనా వీటన్నింటికీ అతీతమైన సత్యమేదో ఆ పిచ్చి బైరాగికి దర్శనం ఐనట్లనిపిస్తుందేం? శుద్ధబైరాగి. సంఘానికి ఏవిధంగానూ పనికిరాకపోగా ఒకరకంగా పరాన్నభుక్కుడు. సంఘానికి బరువుకూడా! ఇవన్నీ నిజాలే కాని-కాని-మళ్లీ అన్నీ నిజం కాదనిపించింది. ఏమో! అతని జీవితానికీ సృష్టిలో ఒక సార్థక్యం ఉండి ఉండదా! నిజం ఎలా తెలుస్తుంది? ఏమైనా నా అనుభూతిని మాత్రం ఎలా నమ్మకుండా ఉండడం?

* * *

క్రితం రాత్రి పొద్దుపోయేవరకూ కబుర్లతో పేకాటతో కాలక్షేపం చేశాము. అసలు రాత్రి యింటికి చేరే సరికే పొద్దుపోయింది. జైల్లో ఒక నిందితునికి అకస్మాత్తుగా ఫిట్సు వస్తున్నా యని ఆ సాయంత్రం కబురు వచ్చింది. వెళ్ళి చూసేసరికి అతను విచిత్రమైన అంగవిన్యాసాలు ప్రదర్శిస్తున్నాడు. అతనికి నిజంగా ఏరోగమూ

లేదు. నటిస్తున్నా డని తెలుసుకుందుకు నా కాశ్టేసేపు పట్టలేదు. ఆ సంగతి చెప్పినా మేజస్ట్రేటుగారికి భయం తగ్గ లేదు. "ఎందుకైనా మంచిది ఇద్దరు పోలీసులను కాపలా ఉంచుతాను, దయ చేసి హాస్పిటల్‌లో చేర్చి వాడి సంగ తేమిటో తేల్చండి. ఒక వేళ అది నిజం జబ్బే అయితే ఈరాత్రికిరాత్రి ఈ జైల్లో ఇత నేమయినా మాకు మాట వస్తుంది" అన్నా డాయన. సరేనని ఆసుపత్రిలో చేర్పించాను. కాపలా కాస్తున్న ఇద్దరు పోలీసులు బీడీలు కాలుస్తూ వరండాలో కూర్చునుండగానే అందరికళ్లూ కప్పి ఫిట్సు వస్తున్నా యన్న రోగి పారి పోయాడు. దానిగురించి ఎంక్వయిరీ. గొడవతో రాత్రి పదుగంట లయింది. ఈ లోపున రాబోయే మునిసిపల్ ఎలక్షన్ల గురించి సోడాకొట్టుదగ్గర నిలబడి బాతాఖానీ వేసిన యిద్దరు యువకులు రాజకీయాల్లోకి దిగి మాటకుమాట పెంచుకుని రెచ్చిపోయి దుకాణదారుని సోడాబుడ్లు రెండింటిని పగలగొట్టడం, శరీరమంతా గాజు పెంకులు గుచ్చుకుని రక్తమయంగా ఆసుపత్రికి చేర్చబడడమూ జరిగింది.

ఈ చీదర లన్నిటినీ వదిలించుకుని యింటికి చేరేసరికి తొమ్మిది గంటల దగ్గ రయింది. అంత రాత్రప్పుడుకూడా



"మా ఆవిడ గుండెల్లో నొప్పంటోందండి. ఒక్కసారి నా గుండె పరీక్షచెయ్యండి."

"మీ ఆవిడకి గుండె నొప్పయితే నిన్ను పరీక్ష చేయడ మెందుకు?"

"మా యిద్దరివీ శరీరాలు వేరయినా హృద యాలు ఒకటే నండి."

---

ఆ బైరాగి ఆ చెట్టుకిందనే ఆ పులి చర్మంమీదే కూర్చుని ఉన్నాడు. ఆసుపత్రి, రోగాలు, పోలీసులు, కొట్లా టలు—వీటన్నిటినీ కొంత సేపైనా మర్చి పోదా మని, మర్నాడు ఆదివారం కనుక ఫర్వా లేదనుకుని రాత్రి ఒంటి గంట దాటేవరకూ పేకాటలో మునిగి పోయాము.

ఉదయం లేవడమే ఆలస్యమయింది. ఇంతలో ఆసుపత్రినుండి వార్డుబాయ్ వచ్చి పిలుస్తున్నా డని అమ్మ శుభవార్త

అందించింది. మెలకువ వచ్చినా ఇంకా బద్ధకంగా పక్కమీద పడుకునే ఉన్న నాకు విసుగూ, కోపమూ ఒక్క సారిగా వచ్చాయి. "ఏ తాగుడు కేసో, తన్నుకున్న కేసో వచ్చిందం టాడా! ఎందుకట! ఇంత పొద్దున్నే తయారయ్యాడు" అన్నాను అమ్మతో. ఎందుకంటే ఏ పురిటి కేసో అయితే వార్డుబోయ్ రాడు; ఆయా వస్తుంది.

అమ్మ ఒకసారి బైటికి వెళ్ళి మళ్ళీ లోపలికొచ్చి "పోస్టుమార్టమ్ అంటు న్నాడమ్మాయీ!" అంది. బద్ధకం ఒక్క దెబ్బతో వదలిపోయింది. పోస్టు మార్టమ్ వచ్చిందంటే ఇక ఆదిన మంతా మరొకపని ముట్టుకుందుకు వీలవదు. ముందు ఆ పని పూర్తిచేసి శవపరీక్ష తాలూకు వివరాలు మేజ స్ట్రేటుకూ, పోలీసువాళ్ళకీ అందించా కనే మరొకపక్క తిరిగిచూడడం. ఈ లోగా చావు బతుకుల్లో ఉన్న మనిషి వచ్చినా ఈ పని వదిలి అటు వెళ్లడానికి వీలులేదు. అలాంటప్పుడే అనిపిస్తుంది: బతికున్న వాళ్లకంటె చనిపోయినవాళ్ల పట్ల గవర్నమెంటు డాక్టర్లకు శ్రద్ధ ఎక్కువ అని.

ఇవతలికి వచ్చి వార్డుబోయ్‌ని అడి గాను. "ఆడా, మగా? ఏం కేసు? ఉరిపోసుకున్నారా! లేక మర్డరా!" వాడన్నాడు-"మగాడేనండి, కత్తుల్తో పొడిసేసినారంట. ఈ ఊళ్ళోనే రాత్రి జరిగిందటండీ. ఎవరో నాకు సరిగా తెలవదమ్మా!" అని. త్వరత్వరగా తయారయి రిక్షా తెప్పించుకుని ఆసు పత్రికి వెళ్ళాను. నర్సును పిలిచి కొత్త రోగులనందరినీ పంపించేయమన్నాను. పాత కేసులన్నిటికీ నిన్నటి మందులే యిచ్చెయ్యమన్నాను. గవర్నమెంటు ఆసుపత్రుల నెరిగిన రోగులకీ తెలుసు పోస్టుమార్టమ్ కేసు వస్తే మరి డాక్టరు ఆరోజుకు దొరక దని. కానిస్టేబుల్ రిపోర్టు తెచ్చియిచ్చాడు. అందులో చనిపోయినవారి పేరూ, ఊరూ తెలీ దనీ, చాలా చోట్ల బాకుతో పొడిచిన ట్లున్న గాయా లున్నాయనీ, పుట్టు మచ్చలూ వగైరాలూ రిపోర్టులో వ్రాశారు. "ఊరూ, పేరూలేని మని షిని ఎవరు చంపి ఉంటారబ్బా! ఎందుకు చంపినట్లు?" అనుకుంటూనే కావల్సిన సామగ్రితో సహా మార్చు యరీకి నడిచాను.

తోటీవాడిని శవానికి చుట్టబెట్టిన గడ్డీ వగైరాలు తీసి శుభ్రంచేసి సామా నంతా తయారుగా ఉంచమని రూము బయట పచారుచేస్తూ కానిస్టేబుల్‌ని అడిగేను. "రిపోర్టులో అతని ఊరూ, పేరూ తెలీ వంటున్నారు? ఇతని

శవం ఎక్కడ కనబడిందట?" అని.

"వెంకయ్యగారి దొడ్లో గడ్డివాము పక్క పడేసి ఉంద టమ్మగారూ! చీకట్లో లేచి దొడ్లసావిడిలోకి వెళుతూ అళ్ళ పాలేరు చూసి ఇంట్లో వాళ్ళకి చెప్పేడట. ఆళ్ళొచ్చి పోలీసుస్టేషన్‌లో రిపోర్టు యిచ్చారండీ" అన్నాడు. ఆ మాటలు వింటూనే మార్చుయరీ గదిలో అడుగుపెట్టి బల్లమీద పడి ఉన్న శవాన్నిచూసి నిర్ఘాంత పోయాను. ఆ క్షణంలో నన్నావహించిన ఆశ్చర్యం, భయం ఇంకేవో చెప్పలేని అనుభూతుల కలయికని వర్ణించగలిగిన మాట నాకు తెలిసినంతవరకూ లేదు. చంపబడినవాడు బైరాగి!

నిన్నటివరకూ సజీవమైన ఆ ప్రశాంత వదనం, ఎవరినీ బాధపెట్టకుండా అన్నిటికీ దూరంగా ఉంటూ చెరువు పక్క రావిచెట్టుకింద రుద్రాక్ష మాలలు తిప్పుకుంటూండే ఆ బైరాగి. నిన్నటివరకూ దారిపక్క పోయేవారిపై చిరునవ్వులు ప్రసరించే ఆ ముఖం యిప్పుడు వికృతంగా ఉంది. శరీరమంతా నల్లగా మాడిపోయి తేజోవిహీనంగా ఉంది. కాషాయాంబరంనిండా రక్తపు మరకలు. గడ్డమంతా రక్తంతో తడిసి అట్టకట్టింది. మెడమీద, నుదుటిమీద,



రొమ్ముమీద పదెనిమిది కత్తిపోట్లు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"ఏ పాపం యెరగని ఇతన్నెందుకు చంపడం?" అని గొణిగాను. అప్రయత్నంగా కళ్ళంట నీళ్లు తిరిగాయి. తోటీవాడు నా చేతికి రబ్బరు చేతులనందిస్తూ "పాపం పుణ్యం అంటూ ఆలోచిస్తే చంపడాలెందుకుంటాయమ్మగోరూ!" అన్నాడు నిదానంగా.

వచ్చి పావుగంట గడచినా అలా నిశ్చేష్టంగాఉన్న నన్ను చూసి తన పాతికేళ్ల సర్వీసులో కొన్ని వందల పోస్టుమార్టములు చేయించిన ఆ తోటీవాడు నన్ను హెచ్చరించాడు. "ఈ నౌకిరీలో ఉన్నోళ్లకి ఈ బాధ తప్పదమ్మగారూ! గబగబా కోసి పారేసి ఆ రిపోర్టు ఆళ్ల మొకాన పడేస్తే సేతులు కడిగేసుకోవచ్చు" అన్నాడు

నిజానికి పోస్టుమార్టములు నాకు కొత్తకాదు. గతమూడేళ్ళ సర్వీసులో తరచూ కాకపోయినా రకరకాల కేసులు చూశాను - చేశాను. కాని.... కాని ఈ బైరాగి శవం. వారంరోజులుగా బాటపక్క రావిచెట్టుకింద మఠంవేసుక్కూర్చున్న బైరాగిదేనా! చిరునవ్వుతో మాటిమాటికీ చేయెత్తి దీవిస్తూ నాలో ఏవేవో జిజ్ఞాసలను రేకెత్తించిన బైరాగిదేనా-ఈ శరీరం. అవును. ఆలోచిస్తూ ఆలస్యంచేయటం మంచిదికాదు. విధ్యుక్తధర్మం నెరవేర్చి తీరాలి. డాక్టరమ్మ పిరికిది అనుకుంటారుకూడా నా యీ ప్రవర్తన చూసి....లోలోపల బాధను తమాయించుకున్నాను. మెదడును ఆలోచనలనుండి స్తంభింపచేసి పని ప్రారంభించాను.

*　*　*

పోస్టుమార్టమ్ తంతంతా పూర్తయి తోటీవాడు చెప్పినట్లు చేతులు కడిగేసుకుని యింటికి చేరుకునేసరికి మధ్యాహ్నం మూడుదాటింది. భరించలేని తలనొప్పి వచ్చేసింది. వంట్లో జ్వరం వచ్చినలాంటి నీరసం. రిక్షాలో యింటికివస్తూ చెరువుపక్క చూడడానికి భయంవేసింది. చూడకుండా ఉండలేకపోయాను. రావిచెట్టు, నీలి ఆకాశం, నిర్మలమైన చెరువు నీరు అన్నీ అలాగే ఉన్నాయి. లేనిది ఒక్క బైరాగే. అయినా అదొక భయంకరమైన దృశ్యంలా కనిపించింది.

ఆదివారమే అయినా ఉదయం వార్డులో పనిచూడలేదు కనుక మళ్ళీ ఆసుపత్రికి వెళ్ళాలి. కాని వెళ్ళలేక పోయాను. వెళ్లాలి అనుకునేసరికి ఆబాట, ఆచెట్టు, ఆ చెరువు, అక్కడలేని బైరాగి అన్నీగుర్తుకు వస్తున్నాయి.

సాయంత్రం ఆరుగంటలయి ఉంటుందికాబోలు. సబిన్స్పెక్టరుగారు సైకిలుమీద మా యింటికి వచ్చారు. వీధివాల్లో కూర్చోపెట్టి "ఏమిటి విశేషం" అన్నాను నీరసంగా. "ఏమీ లేదండీ! ఉదయం కేసుతాలూకు రిపోర్టు పంపించేశారా!" అన్నాడు.

"మూడుగంటలకే పంపించేశానే! మీకింకా చేరలేదూ!" అన్నాను. "చేరే ఉంటుంది. నేను స్టేషన్‌లో లేను. వేరేచోటికి వెళ్ళివస్తున్నాను. ఇంతకీ ఏమిటి మీ అభిప్రాయం? మర్డరేనా?" అన్నాడు.

"ప్రత్యక్షంగా అందరికీ తెలుస్తోంది కదా-శరీర మంతా కత్తిపోట్లు కన్పిస్తూంటే-మీ కింకా సందేహం దేనికి?" అన్నాను.

"ఏమీలేదు. బ్రతికున్న వాడిని పొడిచి అక్కడ పారేశారా! చచ్చిపోయినవాడిని పొడిచి అక్కడ పడేశారా!" అని అన్నాడు.

"అబ్బే! అలాంటి అనుమానానికి తావేలేదు. బ్రతికున్న మనిషిని చంపినట్లు స్పష్టంగా తెలుస్తుంది. నేను జాగ్రత్తగానే చూశాను. అయినా ఊరికి దూరంగా బతికే ఆ బైరాగికి శత్రువు లెవ రుంటారు?" అన్నాను.

"అతనికి శత్రువు లుండటం కాదు. అసలు కథ వేరు. మీరీ వూరికి కొత్త. మా కిలాంటివి అలవాటే – మూడేళ్ళ కిందట సుబ్బయ్యగారి పొలంలో వెంకయ్యగారి పాలేరును చంపిపడేశారు. ఇప్పుడు వెంకయ్యగారి దొడ్లో ఊళ్ళోకి కొత్తగావచ్చిన బైరాగి శవం పడేశారు. ఈ ఊళ్ళో రెండు ముఠాలున్నాయి. అవే సుబ్బయ్యగారిదీ, వెంకయ్యగారిదీ.యిద్దరూ మోతుబర్లు. పలుకుబడిగలవాళ్లు. పదేళ్లనాడు కలిసి వ్యవసాయం చేసేవాళ్లు. క్రమంగా కాలవనీటి తగవులతో ప్రారంభమయిన తగాయిదాలు రకరకాల రూపాలు మారుస్తున్నాయి. కిందటి ఎలక్షన్లలో సుబ్బయ్య కాంగ్రెసులో చేరాడని వెంకయ్య కమ్యూనిస్టు పార్టీకి దన్నిచ్చాడు. అదివరకు జనరల్ ఎలక్షన్లలో ఈ వెంకయ్యగారే ఒక కాంగ్రెసు పెద్దట. ఆరునెల్లాయి మరొక తంటావచ్చిపడింది. సుబ్బయ్య కొడుకు ఒక షోకైన పిల్ల మోజులో పడ్డాడు. అదివరకే ఆ పిల్ల వెంకయ్య అధీనంలో ఉందని వినికిడి. లోపలి రహస్యాలు పూర్తిగా తెలీలేదు కాని ఆ పిల్లగురించి యిప్పుడు సుబ్బయ్య కొడుకూ వెంకయ్యా కత్తులు నూరుకుంటున్నారనీ ఆకావేషి మీద సుబ్బయ్య కొడుకే

ఈ బైరాగిని చంపించి వెంకయ్య దొడ్లో పారేయించాడనీ ఆచూకీవల్ల తెలుస్తూంది. ఏమైతే నేం లెండి బైరాగి చచ్చాడు. మధ్య మీరూ మేమూ చస్తున్నాం. కాని కోర్టుదగ్గర కొచ్చే సరికి ఒక్క సరియైన సాక్ష్యంకూడా దొరకదు. వాళ్ల తగాయిదాలు తగాయి దాల్లాగే ఉంటాయి. కేసులు మాత్రం ఒక్కటీ నిలవదు. మధ్య మనకు పని కల్పించడానికే ఇలాంటి గొడవలు" అంటూ "మంచిది నేను వెళ్తాను డాక్టర్" అని లేచి వెళ్లారు. ఆయనను సాగనంపి నీరసంగా కుర్చీలో చేరబడి పోయాను.

స్పర్థలూ కార్పణ్యాలూ కొట్టుకోవడాలూ చంపుకోడాలూ ఈ లోకానికి కొత్తకాదు. అందులో ఆశ్చర్యపోవలసినదీ లేదు. కొత్తగా అర్థం చేసుకోవలసిందీ ఏమీలేదు. కాని నాకు అప్పటికీ అర్థమవనిదల్లా ఒక్కటే. ఈ విశాల విశ్వంలో ఏం జరిగినా భౌతికంగా కాక పారమార్థికంగా ఆలోచిస్తే ప్రతి దానికీ ఒక వ్యాఖ్యానం ఉంటుందంటారు. సృష్టిలో జరిగే ప్రతిచర్యకీ భగవత్పరంగా ఒక ఉత్తమప్రయోజనం ఉంది, ఉంటుం దంటారు. అదే నిజమయితే ఒక క్షుద్రమైన కారణానికి ఆ కారణంతో ఏ సంబంధమూ లేని బైరాగి బలైపోవడం ఎందుకు? జీవితంలోని సుఖదుఃఖాల మగతలో నుంచి మేల్కొని మమతలకుదూరంగా ఉంటూ ప్రపంచాన్నీ ప్రకృతినీ చిరునవ్వుతో ప్రేమిస్తూ తద్వారా ముక్తుడు కాదలుచుకున్న వాడులా నాకా బైరాగి అర్థమయేడు. క్షుద్రమైన వ్యామోహాలతో కీచులాడుకుని ద్వేషించడ మొక్కటే జీవిత పరమావధిగా బతికే మానవులకు ఈ బైరాగి సాధనంగా ఉపయోగపడడ మేమిటి? బైరాగికి అలాంటి చావు సిద్ధించడంలోని ఉత్తమ ప్రయోజన ఏమిటి? ఈ రహస్యం ఎప్పటికి అర్థమవుతుంది? కాశీవిశ్వనాథుడి సమక్షంలో గతాన్ని గతంలోని కోర్కెలనీ విడిచిపెట్టేసిన బైరాగి, వెంకయ్యగారి గడ్డివాము పక్కన కత్తిపోట్లతో శవంగా పడి ఉండటానికే ఈ ఊరు వచ్చాడా?

క్రితం రోజువరకూ ఒక ప్రశాంతమైన నిర్మలమైన మానవాకారంగా దర్శన మిచ్చి, రోజు తెల్లవారే సరికి భయంకరంగా రక్తసిక్తంగా వికృతంగా మార్చుయరీలో దర్శనమిచ్చిన ఆ బైరాగిగురించి తలుచుకున్నప్పుడల్లా ఆ రెండు ఆకారాల మధ్యగల రహస్య మేమిటా అనే ఆలోచన నాలో మెదలుతూనే ఉంటుంది. ★